మరణించిన వ్యక్తి పేర పంట రుణం స్వాహా

- **అధికార పార్టీ అండదండలతో రూ. 2 లక్షలు విత్‌డ్రా**
- **2023 నుంచి 'రైతుబంధు' సైతం..**

చెన్నారావుపేట, జనవరి 24: మరణించిన వారి పేరున ఉన్న రూ. 2 లక్షల పంట రుణాన్ని ఓ వ్యక్తి స్వాహా చేసిన ఉదంతం మండలంలోని బోడమాణిక్యం తండాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన భూక్యా రాంలీ 2023 జూలైలో మరణించింది. ఆమెకు నలుగురు కుమారులు. వీరిలో ఓ కుమారుడు తన తల్లి పేరున రుణమాఫీ రాగా అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో బినామీ వ్యక్తులను చూపి, ఫోర్జరీ సంతకాలు చేసి చెన్నారావుపేటలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ. 2 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు 2023 నుంచి వస్తున్న రైతుబంధు సాయాన్ని సైతం బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పసిగట్టిన రాంలీ మరో కుమారుడు చందు బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా, కంగుతిన్న అధికారులు వెంటనే విచారణ చేపట్టారు. రాంలీ మరణించినట్లు తెలిసింది. దీనిపై అధికారులు సదరు వ్యక్తిని హెచ్చరించగా అధికార పార్టీ నాయకుడు జోక్యం చేసుకొని బయటకు పొక్కితే మీ ఉద్యోగాలే పోతాయని బెదిరించి, ఎవరికీ తెలియకుండా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు సమాచారం.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

కాంగ్రెస్‌ది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలనే

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు

పర్వతగిరి, జనవరి 24: కాంగ్రెస్‌ది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని ఎర్రబెల్లి ప్రాంగణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు. పర్వతగిరి మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు మాట్లాడుతూ ఎన్నో అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టి సీఎంగా గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రజా పాలనపై దృష్టి పెట్టకుండా కాళేశ్వరం బ్యారేజ్, ఎమ్మెల్సీ కవిత అరెస్టు, సినిమా హీరో అల్లు అర్జున్ వివాదం, కేటీఆర్ ఈకార్ రేసుల వంటి వాటిని ప్రజల ముందు షో వేస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పతనం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బీ యుగేంధర్‌రావు, మాజీ సర్పంచ్‌లు చింతపట్ల మాలతీ సోమేశ్వర్‌రావు, బానోత్ వెంకన్న, మాజీ జడ్పీటీసీ లునావత్ పంతులు, జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్యామ్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల భాస్కర్, మహిళా విభాగం నాయకురాలు బరిగల విజయ, కంటెం ఏకాంతం, చింతల శ్రీనివాస్‌గౌడ్, బర్ల రాజశేఖర్, దబ్బెట నరేశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ వీడ్కోలు సమావేశం బహిష్కరణ

ఫెక్లీపై ఎమ్మెల్సీ పోచంపల్లి ఫొటో లేకపోవడంపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభ్యంతరం

సమావేశాన్ని బహిష్కరించి గేటు బయటనే ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

వర్ధన్నపేట, జనవరి 24: మున్సిపల్ వీడ్కోలు సమావేశాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు బహిష్కరించారు. మున్సిపల్ పాలక వర్గ పదవీకాలం ముగియడంతో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు హాజరయ్యారు. వీడ్కోలు సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్లీలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫొటోను ముద్రించలేదు. దీంతో ఇదేమిటని బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డితోపాటు నలుగురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు సమావేశ మందిరం లోకి వెళ్లకుండా గేటు వద్దే నిరసన తెలిపారు. ప్రారంభమైనా లోనికి వెళ్లకపోవడంతో మున్సిపల్ కమిషనర్ సుధీర్ బాబు, నాయకులు వీరిని బుజ్జగించి తీసుకువెళ్లారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి తోపాటు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను సత్కరించారు. ఐదేళ్లలో పాలకవర్గం చేసిన అభివృద్ధి పనులను వివరించి అభినందించారు.

నర్సంపేట: రాజపల్లి గ్రామసభలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, అర్హులు

ఖానాపురం: కొడ్తిమాట్‌తండాలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నారావుపేట: కోనాపురం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న హనుమాన్‌సింగ్

వర్ధన్నపేట: ప్రజలు లేకపోవడంతో వెలవెలబోతున్న దివిటిపల్లి గ్రామసభ

తప్పుల తడక

- **సంక్షేమ పథకాల జాబితాలో అనర్హుల పేర్లు**
- **ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడి**
- **గందరగోళంగా గ్రామ సభలు**
- **మమ అనిపించిన అధికారులు**
- **పలు గ్రామాల్లో విరిగిన కుర్చీలు**

ఖానాపురం, జనవరి 24: అర్హులైన నిరుపేదలకే సంక్షేమ పథకాలు అందిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామసభల్లో అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పథకాలకు సంబంధించిన జాబితాలు ప్రదర్శించారు. ఇందులో అనర్హులు, కాంగ్రెస్ నేతల పేర్లు మాత్రమే ఉన్నాయని గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు.

అభ్యంతరాల నడుమ సభలు

నర్సంపేట: ప్రజల తీవ్ర నిరసనలు, అభ్యంతరాల నడుమ గ్రామసభలు కొనసాగాయి. అనర్హులను ఎంపిక చేయడంపై మహిళలు, ప్రజలు అధికారుల తీరుపై మండిపడ్డారు. మండలవ్యాప్తంగా గ్రామసభలో పోలీసుల బందోబస్తు మధ్య జరిగాయి. మండలంలో గురిజాల, కమ్మపల్లి, ముత్యాలమ్మతండా, రాజేశ్వర్‌రావుపల్లి, రాజపల్లి, ముత్తోజిపేటలో నిర్వహించిన గ్రామసభల్లో లిస్టు చదువుతుండగానే ప్రజలు నిరసన తెలిపారు. గురిజాలలో అధికారులకు వినతి పత్రం అందించేందుకు బీఆర్ఎస్ నేతలు సభాస్థలికి రాగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఒక దశలో ఘర్షణకు దారితీసింది. పోలీసులు గమనించి వారించడంతో సమస్య సద్దుమణిగింది. ముత్తోజిపేటలో అర్హులకు పథకాలు అందించాలని మహిళలు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని 4, 9, 14, 19, 24 వార్డుల్లో గ్రామసభలు జరిగాయి. జాబితాలో పేర్లు లేని వారి నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. గురిజాల జరిగిన సభలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై అర్హులందరికీ పథకాలు అందిస్తామన్నారు.

ప్రశ్నించిన వారిపై దాడి

ఖానాపురం మండలంలోని కొడ్తిమాట్‌తండాలో శుక్రవారం జరిగిన గ్రామసభలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దాడి చేయడంతో పలు కుర్చీలు విరిగిపోయాయి. పలువురు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన జాబితాను అధికారులు చదువుతుండగా, బీఆర్ఎస్ నాయకులు సుమన్, ప్రవీణ్, అశోక్, వెంకన్న, భద్రు కర్చీల్లో నుంచి లేచి మొదట తండాలో 21 మంది ఎంపికైనట్లు జాబితా ప్రదర్శించి ఇప్పుడు 8 మంది పేర్లే చదవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు పూల్యా, కృష్ణ, రమేశ్, లక్ష్మా, బాలు జోక్యం చేసుకుని బీఆర్ఎస్ శ్రేణులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ నాయకులు కుర్చీలతో దాడి చేశారు. దీంతో లకావత్ అశోక్, ప్రవీణ్, గుగులోత్ అశోక్, గుగులోత్ భద్రు గాయపడ్డారు. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. అధికారులను ప్రశ్నించినందుకే తమపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని బాధితులు సుమన్, ప్రవీణ్ వాపోయారు. దాడికి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, మండలంలోని రాగంపేట, కొత్తూరు, రంగాపురం, కొడ్తిమాట్‌తండా, కీర్యతండాలో నిలదీతల మధ్య గ్రామసభలు జరిగాయి. జాబితాల్లో అనర్హులు, కాంగ్రెస్ నాయకుల పేర్లు మాత్రమే ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. కొడ్తిమాట్‌తండాలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ శ్రేణులపై దాడి చేశారు.

పోలీసుల నిర్బంధం మధ్య సభలు

చెన్నారావుపేట: మండలంలో జరిగిన గ్రామసభలు రసాభాస, గందరగోళంగా ముగిశాయి. శుక్రవారం మండలంలోని కోనాపురం, ఉప్పరపల్లి, గొల్లపల్లె బాపునగర్, అమ్మతండా, చెరువుకొమ్ముతండాలో గ్రామసభలు జరిగాయి. కోనాపురంలో నిరుపేద కుటుంబానికి చెందిన హనుమాన్ సింగ్ తనకు ఇందిరమ్మ ఇల్లు ఎందుకు మంజూరు చేయలేదని అధికారులను ప్రశ్నించాడు. తనకు గుంట భూమి లేదని, జాబ్‌కార్డు ఉన్నా ఆత్మీయ భరోసాలో కూడా పేరు రాలేదని వాపోయాడు. పోలీసుల నిర్బంధం మధ్య తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

దివిటిపల్లి గ్రామసభ వెలవెల

వర్ధన్నపేట: మండలంలోని దివిటిపల్లి గ్రామసభ ప్రజలు రాకపోవడంతో వెలవెలబోయింది. గ్రామంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. మధ్యాహ్నం వరకూ సభకు ప్రజలెవరూ రాకపోవడంతో అధికారులు విస్మయానికి గురయ్యారు. సభకు వచ్చి సమస్యలు చెప్పినా పరిష్కారమయ్యే పరిస్థితి ఉండడం లేదని పత్రికలు, సోషల్ మీడియా ద్వారా తెలుసుకుంటున్న సామాన్యులు సభకు రావడం కూడా సమయం వృథా అవుతుందని భావించి రావడం లేదని పలువురు గ్రామస్తులు అంటున్నారు. దివిటిపల్లిలో మధ్యాహ్నం తర్వాత కొద్ది మంది వచ్చి అధికారులతో మాట్లాడి వెళ్లిపోయారు. ఉప్పరపల్లిలో ప్రజలు హాజరై జాబితాల్లో అర్హుల పేర్లు లేవని, నిరుపేదలకు పథకాలు అందించాలని కోరారు.

నెక్కొండ: లావుడ్యా వాగ్యానాయక్ తండా గ్రామసభలో వాగ్వాదం చేసుకుంటున్న ఇరువర్గాలు

నెక్కొండలో అధికారుల నిలదీత

నెక్కొండ: నెక్కొండ మండలంలోని లావుడ్యా వాగ్యానాయక్ తండాలో అధికారులను విపక్ష నాయకులు ప్రశ్నిస్తుంటే అధికార పార్టీ నాయకులు అడ్డుతగిలారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అర్హులకు చోటు దక్కడం లేదని ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్నాతండాలో గ్రామసభతో ఒరిగేదిలేదని, మభ్యపెట్టడం తప్ప చేసేదేమీ లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభను పోలీసుల జోక్యంతో కొనసాగించారు. గుండ్రపల్లి, బొల్లికొండలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.

అధికారులపై ప్రశ్నల వర్షం

గీసుగొండ: లిస్టులు తప్పుల తడకగా ఉండడం, అర్హులు కాదని అనర్హుల పేర్లు రావడంతో ప్రజలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. మండలంలోని కొమ్మాల, ఊకల్, మనుగొండ, వంచనగిరిలో జరిగిన గ్రామసభలు గందరగోళంగా సాగాయి. అధికారులు లిస్టు చదవుతున్న క్రమంలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులతో అర్హులు గొడవకు దిగారు. ఊకల్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో కృష్ణవేణికి మొరపెట్టుకున్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా లాభం లేదని కొమ్మాలలో మహిళలు అధికారులను ప్రశ్నించారు. ఊకల్‌లో ఆత్మీయ భరోసాలో భూమి ఉన్న వారి పేర్లు వచ్చాయని, కూలీల పేర్లు రాలేదని గడ్డమీది భాగ్యమ్మ వాపోయారు.

ప్రభుత్వానికి విజన్ లేదు..

నల్లబెల్లి: గ్రామసభలు మండలంలోని రంగాపురం, నందిగామ, ముచ్చింపులతండాలో ఉద్రిక్తతల మధ్య గ్రామసభలు కొనసాగాయి. అయితే , సభలు ప్రారంభం కాగానే దరఖాస్తుదారుల పేర్లు ప్రదర్శించి ముగించేందుకు అధికారులు యత్నించడంతో లబ్ధిదారుల లిస్టును ఎందుకు ప్రదర్శించడం లేదని ప్రజలు నిలదీశారు. రంగాపురంలో మాజీ సర్పంచ్ చీకటి ప్రకాశ్‌తోపాటు తెలంగాణ ఉద్యమకారుడు భట్టు సాంబయ్య అధికారుల తీరును ఖండించారు. గ్రామసభకు వచ్చిన పేదల పేర్లు కాకుండా భూములు ఉన్న వారు, ధనవంతుల పేర్లు జాబితాలో రావడంపై విస్మయం చెందారు. లబ్ధిదారుల ఎంపిక తమ చేతుల్లో లేదని మండల ప్రత్యేకాధికారి గోవిందరాజన్ సమాధానం ఇచ్చారు. దీంతో ప్రజలు ప్రభుత్వ వైఖరిపై దుమ్మెత్తి పోశారు.

మైలారం సభలో ఉద్రిక్త వాతావరణం

రాయపర్తి: మండలవ్యాప్తంగా సభలు గందరగోళంగా మారాయి. మండలకేంద్రంలో జరిగిన గ్రామ సభలో ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రజాపాలన గ్రామసభల్లో తాము అందించిన దరఖాస్తులు ఎటు పోయాయని ప్రశ్నించారు. కులగణన, ఇంటింటి సర్వే, ప్రజాపాలన అంటూ ప్రజలను ఇలా అధికారుల చుట్టూ తిప్పుకోవడమేనా మీ పని అంటూ మాజీ వార్డు సభ్యుడు నూనె అనిల్‌కుమార్‌యాదవ్‌తోపాటు యువకులు, గ్రామస్తులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. తెట్టెకుంటతండాలో ఎంపీవో కూచన ప్రకాశ్ ప్రసంగిస్తుండగా తండావాసులు అడ్డు తగిలి సభలో గందరగోళం సృష్టించారు. మైలారంలో గ్రామసభ రణరంగాన్ని తలపించింది. జాబితా విషయంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ అధికారులను ప్రశ్నించగా కాంగ్రెస్ పార్టీ నేత రంగు కుమార్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులపై దాడులకు దిగే ప్రయత్నం చేశారు. ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి ఇరువర్గాలను సభ నుంచి తీసుకెళ్లారు. బాల్‌నాయక్‌తండా, గట్టికల్, జగన్నాథపల్లి, కాట్రపల్లి, రాగన్నగూడెం, మొరిపిరాలలో గ్రామసభలు మొక్కుబడిగా సాగాయి.

'గ్రేటర్'లో 42,641 దరఖాస్తులు

వరంగల్: గ్రేటర్ కార్పొరేషన్‌లో వార్డు సభలు ముగిశాయి. నాలుగు రోజులుగా 66 డివిజన్లలో అధికారులు వార్డుసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే, వార్డు సభల్లో ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. 66 డివిజన్లలో నిర్వహించిన వార్డు సభల్లో 42,641 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. వార్డు సభల్లో ముఖ్యంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డుల కోసం 27,977 దరఖాస్తులు రాగా, ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,662 వచ్చాయని అధికారులు తెలిపారు.



నెక్కొండ: లావుడ్యా వాగ్యానాయక్ తండా గ్రామసభలో వాగ్వాదం చేసుకుంటున్న ఇరువర్గాలు



నల్లబెల్లి: రంగాపురంలో అధికారులను నిలదీస్తున్న మాజీ సర్పంచ్ ప్రకాశ్‌తోపాటు తెలంగాణ ఉద్యమకారుడు భట్టు సాంబయ్య



గీసుగొండ: కొమ్మాలలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



రాయపర్తి: తెట్టెకుంటతండాలో ఎంపీవో ప్రకాశ్ ప్రసంగాన్ని అడ్డుకుంటున్న తండావాసులు



నర్సంపేట: గురిజాలలో గ్రామసభ సందర్భంగా మోహరించిన పోలీసులు

రిసెప్షనిస్టుతో మాట్లాడుతున్న సీపీ

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

వర్ధన్నపేట, జనవరి 24: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో జవాన్లు, పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు. వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సీఐ, ఎస్సై, ఏసీపీ కార్యాలయాలను సందర్శించి స్టేషన్‌కు సంబంధించిన సమస్యలు తెలుసుకున్నారు. జవాన్లు, పోలీస్ క్వార్టర్స్‌తోపాటు స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అలాగే, స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రిసెప్షనిస్టులు, రైటర్లతో సీపీ మాట్లాడి సూచనలు చేశారు. అనంతరం ఉప్పరపల్లిలో జరిగిన గ్రామసభను సందర్శించిన సీపీ అధికారులతో మాట్లాడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లారు.

కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఘనంగా వద్దిరాజు పుట్టిన రోజు వేడుకలు

పోచమ్మమైదాన్, జనవరి 24: బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పుట్టిన రోజు వేడుకలను పోచమ్మమైదాన్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మసూద్ కేక్ కట్ చేసి, స్థానికులకు బిర్యాని ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే, వద్దిరాజు రవిచంద్ర యువసేన ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొలుగొడ్డు శ్రీనివాస్, వీణవంక కిరణ్, జక్కొజు రాజేందర్, పుష్పలతయ, ఉమ్మడి వరంగల్ జిల్లా జై గౌడ సంఘం అధ్యక్షుడు మార్క రవి, వద్దిరాజు రవిచంద్ర యువసేన సభ్యులు ఎరుకొండ వినయ్, షారు, బొల్లోజు శ్రీనివాస్, ఎండీ షారూక్, వాంకుడోత్ తరుణ్, వెంకటేశ్, ఎండీ అబ్బాస్, వినయ్, మహేశ్, సంతోష్, శ్రవణ్ పాల్గొన్నారు. అలాగే, భద్రకాళి ఆలయంలో యువసేన సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తుల పేరుతో కాలయాపన : బీఆర్ఎస్

వర్ధన్నపేట, జనవరి 24: సంక్షేమ పథకాల పేరుతో ప్రజల నుంచి కేవలం దరఖాస్తులు తీసుకొని కాలం వెళ్లదీస్తున్నారే తప్ప పేదలకు ఒరగబెట్టిందేమీ లేదని వర్ధన్నపేట మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామసభలు, ఇంటింటి సర్వేల పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న ప్రభుత్వం అర్హులకు మాత్రం పథకాలు అందించేందుకు సిద్ధంగా లేదని విమర్శించారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుజ్జ గోపాల్‌రావు, తోటకూరి రాజమణి, అనిత, శ్రీనివాస్, పూజారి రఘు, సుజాత, అజీమ్, తుమ్మల యాకయ్య, ఏకాంతం, చందర్‌రావు, వేణుగోపాల్‌రావు, మార్త సారంగపాణి, సంపత్, శ్రీధర్, భాస్కర్, అశోక్, రాజు, వీరస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

'పథకాలు అందకపోతే ఆందోళన తప్పదు'

పోచమ్మమైదాన్, జనవరి 24: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించకుంటే ఆందోళన తప్పదని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల జాబితాల్లో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేస్తున్నారని, వాటిని పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

నేటి ప్రజావాణి రద్దు

గిర్మాజీపేట, జనవరి 25: జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగుల కోసం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రజావాణిని పాలనాపరమైన కారణాల వల్ల కలెక్టర్ రద్దు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని దివ్యాంగులు, వృద్ధులు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

'రాజపల్లిని విలీనం చేయొద్దు'

నర్సంపేట, జనవరి 24: రాజపల్లిని నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామసభలో బీఆర్ఎస్ శ్రేణులు నేలపై కూర్చొని నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు లేవనెత్తిన తీర్మానానికి మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు మద్దతు పలికారు. అనంతరం తీర్మాన ప్రతిని అధికారులకు అందజేచారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఖానాపురం, జనవరి 24: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన గౌస్ పాషా(50) రైస్ మిల్లులో కూలీ పని చేస్తున్నాడు. వచ్చే సంపాదనతో కుటుంబం గడవకపోవడంతో అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వాళ్లు అడుగుతుండడంతో ఇబ్బంది పడుతున్నాడు. మనస్తాపంతో ఈ నెల 23న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజుపల్లి క్రాస్‌రోడ్ వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు పరంగల్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

ఖానాపురం, జనవరి 24: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి చెందింది. బాలుతండాకు చెందిన ఎర్రనాగుల అచ్చమ్మ (56) గతంలో ధర్మారావుపేట సర్పంచ్‌గా ఐదేళ్లు పని చేశారు. ఈ నెల 10న భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొని గాయపడింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తండాకు చేరుకొని అచ్చమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ప్